www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 19 సెప్టెంబరు 2025 5 పశ్చిమ గోదావరి



'కౌలురైతులకు గుర్తింపు కార్డులివ్వాలి'

ఆచంట : పంటలు పండిస్తున్న కౌలురైతులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వకుండా భూయజమానులు ఒప్పుకుంటేనే కార్డులు ఇస్తామని చెప్పడం వైసిపి ప్రభుత్వానికి, కూటమి ప్రభుత్వానికి తేడా లేదని ఏపి కౌలురైతుల సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు అన్నారు. వల్లూరు సెంటర్లో గురువారం చలో అసెంబ్లీ కరపత్రాలను ఆవిష్కరించి కౌలు రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో శ్రీనివాస్ మాట్లాడుతూ కౌలురైతులకు ప్రభుత్వమే గుర్తింపు కార్డులు ఇవ్వాలని, వెంటనే అన్నదాత సుఖీభవ సాయం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22న జరిగే చలో అసెంబ్లీ కార్యక్రమానికి కౌలు రైతులందరూ పెద్ద ఎత్తున రావాలని ప్రచారం చేస్తున్నామన్నారు. ప్రభుత్వం వెంటనే కౌలు చట్టాన్ని మార్చాలని, 20 వేల పెట్టుబడి సాయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలురైతులు దొంగ సత్యనారాయణ, ఆలమూరు నాగరాజు, ఆలమూరు శ్రీనివాస్, కోలాటి శ్రీనివాసరావు, పువ్వులవాయల నాగరాజు, పాతగోలుసు బెజెమెన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకే రణభేరి

గత ప్రభుత్వ అడుగు జాడల్లోనే కూటమి పాలన

ప్రపంచ బ్యాంకు అప్పు కోసం విద్యారంగం ప్రయివేటీకరణ

ఉపాధ్యాయ సమస్యలు వెంటనే పరిష్కరించాలి

రణభేరి సభలో ఎంఎల్‌సి బి.గోపీమూర్తి, యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్

ప్రజాశక్తి - భీమవరం

గత ప్రభుత్వ అడుగుజాడల్లోనే కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని, గత 15 నెలల పరిపాలనలో అది స్పష్టంగా కన్పిస్తోందని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి, యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ అన్నారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకే యుటిఎఫ్ రణభేరి యాత్ర చేపట్టిందని తెలిపారు. ఉపాధ్యాయుల వృత్తిపరమైన, ఆర్థికపరమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యుటిఎఫ్ చేపట్టిన రణభేరి యాత్ర గురువారం జిల్లాలోకి ప్రవేశించింది. యుటిఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు 500 మోటార్ సైకిళ్లతో రణభేరి యాత్రకు పెనుగొండ మండలం సిద్ధాంతం వద్ద ఘనస్వాగతం పలికారు. అక్కడ నుంచి పెనుగొండ, మార్టేరు, పాలకొల్లు, వీరవాసరం, భీమవరం, పిప్పర మీదుగా తాడేపల్లిగూడెం చేరుకుంది. భీమవరం ప్రకాశం చౌక్ సెంటర్లో ఏర్పాటు చేసిన సభకు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి గోపీమూర్తి మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రవీణ్ ప్రకాష్ ముసుగులో ఉపాధ్యాయులను అంతర్జాలం కబంధ హస్తాల్లో పెట్టి తీవ్ర ఇబ్బందులకు గురి చేశారన్నారు. గత ప్రభుత్వం ఐదు డిఎలను పెండింగ్లో పెట్టిందన్నారు. పిఆర్‌సి అని చెప్పి రివర్స్ పిఆర్‌సి ఇచ్చారని విమర్శించారు. గత ప్రభుత్వం ఆర్థిక ప్రయోజనాలపై దెబ్బ మీద దెబ్బ కొట్టిందని చెప్పి గత ఎన్నికల్లో కూటమికి రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులు ఏకపక్షంగా ఓట్లు వేశారన్నారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులు తమకు ఓట్లేశారని, కడుపు నిండిపోయిం దని చెప్పారని గుర్తు చేశారు. పిఆర్‌సి కమిషన్ నియమిస్తామని, పెండింగ్లో ఉన్న డిఎలు, వేల కోట్ల బకాయిలు చెల్లిస్తామని, ఉపాధ్యాయులకు మరింత గౌరవాన్ని పెంచుతామని చెప్పి మోసగించారని విమర్శించారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు అడుగుజాడల్లో గత, ప్రస్తుత ప్రభుత్వాలు నడుస్తున్నాయన్నారు. కేవలం రూ.1550 కోట్లు అప్పు కోసం విద్యారంగ ప్రయివేటీకరణకు పాలకులు పూనుకున్నారన్నారు. ఒకపక్క విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తున్నట్టు రకరకాల సంస్కరణలు ప్రకటిస్తూ రెండోపక్క ఉపాధ్యాయులను పాఠాలు చెప్పనీయకుండా బోధనకు దూరం చేస్తున్నారన్నారు. ఇదే సందర్భంలో తల్లిదండ్రులకు మీ పిల్లలను ఇష్టమొచ్చిన చోట చదివించుకోమని డబ్బులిస్తున్నారని చెప్పారు. ఈ రకంగా ప్రభుత్వ విద్యారంగాన్ని నాశనం చేస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో నాలుగేళ్లలో పది లక్షల మంది, కూటమి పరిపాలనలో ఒక్క ఏడాదిలోనే మూడు లక్షల మంది విద్యార్థులు ప్రయివేట్ బాట పట్టారని చెప్పారు. బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులను తొలగించాలని డిమాండ్ చేశారు. పోరాట ఫలితంగా రూ.5 వేల కోట్లు బకాయిలు సాధించుకున్నామన్నారు. గత ప్రభుత్వం నియమించిన పిఆర్‌సి కమిషనర్ రాజీనామా చేశారని, కూటమి ప్రభుత్వం కనీసం కమిషనర్‌ను కూడా నియమించే పరిస్థితి లేదని విమర్శించారు. ఈ నెల 25న గుంటూరులో రణభేరి బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలాదిమంది ఉపాధ్యాయులు ఆ సభకొచ్చి గర్జించబోతున్నారని చెప్పారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు శ్రీదేవి, సుభాషిణి, జ్యోతిబసు, చక్రవర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం, సహాధ్యక్షులు కె.రాజశేఖర్, జిల్లా నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెనుగొండ రూరల్: సిద్ధాంతం బ్రిడ్జి వద్ద యుటిఎఫ్ రణభేరి మోటారు సైకిల్ యాత్రను యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ నెల 15న తుని నుంచి ప్రారంభమైన రణభేరి యాత్ర కోనసీమ అంబేద్కర్ జిల్లా రావులపాలెం మీదుగా గురువారం సిద్ధాంతం బ్రిడ్జి వద్ద పశ్చిమగోదావరి జిల్లాలోకి ప్రవేశించింది.



భీమవరం: రణభేరి బైక్ జాతాలో అగ్రభాగాన ఉపాధ్యాయ ఎంఎల్‌సి గోపీమూర్తి

పాలకొల్లు: యుటిఎఫ్ రణభేరి యాత్ర గురువారం మధ్యాహ్నం పాలకొల్లు పట్టణానికి చేరింది. ఈ సందర్భంగా గాంధీబొమ్మల సెంటర్‌లో జరిగిన సభలో యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ బోధనేతర పనులు భారంతో ఉపాధ్యాయులు బోధనకు దూరమవుతున్నారన్నారు. సుదీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న ఉమ్మడి సర్వీస్ రూల్స్ సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు. సిపిఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నేతలతోపాటు కాకినాడ జిల్లా అధ్యక్షులు సిహెచ్.సూరిబాబు, కోనసీమ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంటివి.సుబ్బారావు, నేత టి.విజయ్‌కృష్ణ, జిల్లా నేతలు సిహెచ్.పట్టాభిరామయ్య, సిహెచ్.నాగశిరోమణి, కె.రాజశేఖర్, పోలిశెట్టి క్రాంతికుమార్, పి.శివప్రసాద్, పిజె.కుమార్, జి.లక్ష్మీనారాయణ, జి.రామకృష్ణరాజు, డి.పద్మావతి, పి.కృష్ణకుమారి, జివిజి.రామానుజరావు పిల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వీరవాసరం: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలంటూ యుటిఎఫ్ చేపట్టిన రణభేరి గురువారం సాయంత్రం వీరవాసరం బస్టాండ్ సెంటర్‌కు చేరింది. ఈ సందర్భంగా రాష్ట్ర నేతలు మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయులను పాఠాలు చెప్పే పని నుంచి దూరం చేయడం మానుకోవాలన్నారు. ఈ నెల 24వ తేదీలోపు తమ సమస్యలు పరిష్కరించకపోతే 25న గుంటూరులో వేలాది మంది ఉపాధ్యాయులతో నిర్వహించే సభతో తమ సత్తా తెలియజేస్తామన్నారు.



పెనుగొండ రూరల్: సిద్ధాంతంలో వినతిపత్రం స్వీకరిస్తున్న యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్, ఇతర నేతలు



పాలకొల్లు: మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్



వీరవాసరంలో..

పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు చర్యలు

జిల్లా కలెక్టర్ నాగరాణి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో పారిశ్రామిక పార్కులు ఏర్పాటుకు యుద్ధ ప్రాతిపదికన తగిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం కలెక్టరేట్లో పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధి సంస్థ, పర్యాటకం, ఎంప్లాయిమెంట్, కెవిబిబి అధికారులతో ఆమె సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక పార్కులు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కొత్త పరిశ్రమలు ఏర్పాటుకు సన్నాహక చర్యలు చేపట్టాలన్నారు. గతంలో మంజూరు చేసిన పరిశ్రమలను స్థాపించారా, ఉత్పత్తి కొనసాగుతుందా, మార్కెటింగ్ ఎలా చేస్తున్నారు తదితర వివరాలను అందజేయాలన్నారు. జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందినప్పుడే స్థిరమైన వృద్ధిరేటు సాధించగలమన్నారు. రాయితీపై భూమి, స్టాంప్ డ్యూటీ రాయితీ, లీజు పద్ధతి, ఎస్‌సి, ఎస్‌టిలకు ప్రత్యేక రాయితీలు తదితర వివరాలపై విస్తృత సమాచారం అందించాలన్నారు. ఖాదీ విలేజ్ ఇండస్ట్రియల్ బోర్డ్ ఎకో ఫ్రెండ్లీ ఉత్పత్తులను పరిశీలించాలన్నారు. కెవిఐబి ద్వారా పిఎంఇజిపి కింద సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ రుణాలను మంజూరు చేయాలని సూచించారు.

నియోజకవర్గానికి ఒక హోటల్ ఏర్పాటు

జిల్లాలో పర్యాటకరంగం అభివృద్ధి చెందేందుకు విస్తృత చర్యలు చేపట్టాలని జిల్లా పర్యాటక శాఖాధికారిని ఆదేశించారు. జిల్లాలో కొత్త హోటల్స్ ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఒక కొత్త హోటల్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సూచించారు. చదువుకున్న ఏ ఒక్కరూ నిరుద్యోగులుగా ఉండకూడదనే లక్ష్యంతో పని చేయాలన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖాధికారి యు.మంగపతిరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకమాన్, జిల్లా పర్యాటక శాఖాధికారి ఎవి.అప్పారావు, ఉండి ఐటిఐ ప్రిన్సిపల్ ఆనంద్ వేణుగోపాల్, కెవిఐబి అధికారి ఆనంద్, ఎంప్లాయిమెంట్ యంగ్ ప్రొఫెషనల్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

లేకపోతే ఆందోళన ఉధృతం

మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఫెడరేషన్, సిఐటియు

ప్రజాశక్తి - తణుకు

మున్సిపల్ పారిశుధ్య కార్మికుల న్యాయమైన సమస్యలు వెంటనే పరిష్కరించాలని, లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ధనాల వెంకట్రావు, సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాలు అందజేశారు. మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, 12వ పిఆర్‌సి వేయాలని, పిఆర్‌సి ప్రకారం వేతనాలు ఇవ్వాలని, అందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, 17 రోజుల సమ్మె కాలపు ఒప్పందాలకు జిఒలు ఇవ్వాలని, పర్మినెంట్ కార్మికులకు సరెండర్ లీవులు, డిఎ బకాయిలు వెంటనే ఇవ్వాలని, చనిపోయిన, అనారోగ్యం, రిటైర్డ్ అయిన వారి స్థానంలో వారి పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలని, జులైలో జరిగిన సమ్మెకు జీతం ఇవ్వాలని, పట్టణ విస్తీర్ణానికి అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని నినదించారు. ధర్నానుద్దేశించి వెంకట్రావు, ప్రతాప్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ స్కూల్ స్వీపర్లకు 4 నెలల వేతనాలు వెంటనే ఇవ్వాలని, కనీస వేతనం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు అడ్డగర్ల అజయకుమారి, గార రంగారావు, మున్సిపల్ యూనియన్ నేతలు నీలాపు ఆదినారాయణబాబు, అర్జీ కృష్ణబాబు, పి.జ్యోతిబాబు, కొమార రాణి, అనంత లక్ష్మి, కొత్తపల్లి అయ్యప్ప, డి.గంగాధర్, కోటే వెంకటేశ్వరరావు, అర్జి లక్ష్మి, ఏలూరు వెంకటలక్ష్మి, టి.రామలక్ష్మి, ఎ.మల్లేశ్వరి, డి.దుర్గ, వై.మంగమ్మ, జి.కుసుమ, లలిత కుమారి, ఎం.శ్రీను, కె.సుధీర్‌బాబు పాల్గొన్నారు.



తణుకులో...

తాడేపల్లిగూడెం: సమ్మెకాలపు ఒప్పందాల జిఒలు జారీ చేయాలని, 12వ పిఆర్‌సి వెంటనే ప్రకటించాలని సిఐటియు పట్టణ కార్యదర్శి కరిచ రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యాన గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబుకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఆప్కాస్ రద్దును ఆపాలని, లేనిపక్షంలో కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు ఎవి.శ్రీనివాస్, కార్యదర్శి కొడమంచిలి బాబు మాట్లాడుతూ ఇపిఎఫ్, ఇఎస్ఐ బకాయిలు ఖాతాల్లో జమ చేయాలని, డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు అమలు చేయకపోతే దశలవారీ ఆందోళన కార్యక్రమాలు చేపట్టి కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎవి.శ్రీనివాస్, కొడమంచిలి బాబు, అల్లం మంగారావు, ఎస్.సతీష్, కె.దయామణి, టి.నాగమణి, టి.శ్రీను, కె.మణికుమార్, వర్కర్లు, డ్రైవర్లు, క్లాప్ డ్రైవర్లు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెంలో..



'స్మార్ట్'గా.. బిగించేస్తున్నారు..!

ఇళ్లకూ స్మార్ట్ మీటర్ల బిగింపుతో జనాల్లో ఆందోళన

ఇప్పటికే రెండు జిల్లాల్లో 82 వేల మీటర్లు బిగింపు

పాత మీటర్లలో ఇబ్బందులొస్తే వెంటనే స్మార్ట్ మీటర్ బిగింపు

వివరం చెప్పకుండానే వినియోగదారుల నుంచి సంతకాలు

మీటర్ల బిగింపు వేగవంతానికి కాంట్రాక్ట్ పద్ధతిన అప్పగింపు

స్మార్ట్ మీటర్లతో ఇప్పటికే వ్యాపారులు గగ్గోలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'ఏలూరు నగరం పత్తేబాద్ ప్రాంతానికి చెందిన జి.శేషగిరి ఇంటి విద్యుత్ మీటర్ ఆగిపోయింది. దీంతో మీటర్ మార్పు కోసం విద్యుత్ శాఖాధికారులను సంప్రదించారు. ఇప్పటి వరకూ ఉన్న సాధారణ మీటర్ కాకుండా స్మార్ట్‌మీటర్ తెచ్చి బిగించేశారు. పూర్తి వివరాలు చెప్పకుండానే సంతకం చేయించుకున్నారు. స్మార్ట్ మీటర్ అని తెలిసి బాధితుడు లబోదిబోమంటున్నారు. స్మార్ట్ మీటర్ తీసేసి సాధారణ మీటర్ బిగించాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోని పరిస్థితి ఉంది'.

పైన చెప్పిన శేషగిరే కాదు.. స్మార్ట్ మీటర్ల బిగింపుతో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని విద్యుత్ వినియోగదారులు పెద్దఎత్తున ఆందోళనకు గురవుతున్నారు. అదానీ కంపెనీకి లాభం చేకూర్చేందుకు కేంద్రంలోని మోడీ సర్కార్, రాష్ట్రంలో కూటమి సర్కార్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై జనం నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో ప్రభుత్వం రూటుమార్చి ముందుకు సాగుతోంది. 'స్మార్ట్ మీటర్ల బిగింపుపై బలవంతం ఉండదు. వినియోగదారుడు అంగీకరిస్తేనే స్మార్ట్ మీటర్ ఏర్పాటు చేస్తాం' అని చెప్పి అందుకు విరుద్ధంగా ముందుకు సాగుతోంది. వినియోగదారుల అభిప్రాయంతో సంబంధం లేకుండా మాయమాటలు చెప్పి అడ్డదారుల్లో బిగింపు ముందుకెళ్తోంది. గృహ వినియోగదారులు ఎవరైనా తమ మీటరు స్ట్రక్ అయ్యిందనిగాని, ఇతర ఫిర్యాదు చేసినా వెంటనే అక్కడ స్మార్ట్‌మీటర్ బిగించేస్తున్నారు. స్మార్ట్‌మీటర్ గురించి పూర్తి వివరాలు చెప్పకుండా వినియోగదారులతో విద్యుత్ సిబ్బంది సంతకాలు చేయిస్తున్న పరిస్థితి ఉంటోంది. అసలు విషయం తెలిసి వారంతా గగ్గోలు పెడుతున్నారు. స్మార్ట్ మీటర్ తొలగించాలని అధికారులకు మొరపెట్టుకుంటున్నా వినిపించుకోని పరిస్థితి ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 2024 సెప్టెంబర్ నుంచి స్మార్ట్‌మీటర్లు బిగింపు ప్రారంభించింది. వ్యాపార దుకాణాలకు, పరిశ్రమలకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు ఇళ్లకు స్మార్ట్‌మీటర్ల బిగింపు ప్రారంభించింది. ఏలూరు జిల్లాలో మొత్తం ఆరు లక్షల మూడు వేల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ముందుగా లక్షా ఎనిమిది వేల విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు బిగించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకూ 34,955 స్మార్ట్ మీటర్లను అమర్చారు. ఇందులో గృహ విద్యుత్ కనెక్షన్లు 3,909 ఉండగా, వ్యాపార, పరిశ్రమలకు సంబంధించిన విద్యుత్ కనెక్షన్లు 31,046 ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలో దాదాపు ఆరు లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉండగా తొలివిడతగా లక్షా 56 వేల విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్‌మీటర్లు బిగించాలని లక్ష్యం పెట్టుకున్నారు. ఇప్పటి వరకూ 47,614 కనెక్షన్లకు స్మార్ట్‌మీటర్ల బిగింపు పూర్తి చేశారు. ఇందులో గృహ విద్యుత్ కనెక్షన్లు 2,694 ఉండగా, కమర్షియల్ విద్యుత్ కనెక్షన్లు 44,920 ఉన్నాయి. సోలార్ కనెక్షన్ పెట్టుకున్న ప్రతి ఇంటికీ స్మార్ట్‌మీటర్ బిగిస్తున్న పరిస్థితి ఉంది. విద్యుత్ మీటర్ ఆగిపోయినా, సోలార్ ఏర్పాటు చేసుకోవాలనుకున్నా స్మార్ట్ మీటర్ బిగిస్తున్నారు. తొలుత వినియోగదారులకు ఏమీ అర్థం కావడం లేదు. తర్వాత స్మార్ట్ మీటర్ గురించి తెలుసుకుని తొలగించాలని కోరుతున్నా విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికే స్మార్ట్‌మీటర్ ఏర్పాటు చేసిన వ్యాపారులు బిల్లులు పేలిపోతున్నాయని లబోదిబోమంటున్నారు.

స్మార్ట్ మీటర్ల బిగింపు వేగవంతానికి చర్యలు

అదానీ కంపెనీకి చెందిన విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించేందుకు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 200 మంది సిబ్బందిని నియమించారు. స్మార్ట్‌మీటర్ల బిగింపు వేగంగా జరగడం లేదనే కారణంతో వారందరినీ ఉద్యోగాల నుంచి తొలగించి కాంట్రాక్ట్ పద్ధతిన అప్పగించే ప్రక్రియ మొదలైంది. ప్రతి కాంట్రాక్ట్‌దారునికి ఇన్ని మీటర్లు బిగించాలని అప్పగిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో స్మార్ట్‌మీటర్లు బిగింపు వేగవంతం చేసేందుకు ప్రణాళికలు రచించి ముందుకు సాగుతున్నారు. ఇళ్లకు స్మార్ట్‌మీటర్లు బిగించడంతో జనం గగ్గోలు పెడుతున్నారు. వినియోగదారులు స్మార్ట్‌మీటర్ వద్దని చెబుతున్నప్పుడు మీటర్ మార్పు చేయకుండా విద్యుత్ సిబ్బంది ఇబ్బంది పెట్టడం చర్చనీయాంశమవుతోంది. చాప కింద నీరులా స్మార్ట్ మీటర్ల బిగింపు సాగిపోతుంది.

మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడండి

ఏచూరి వర్ధంతి సభలో సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం

ఆకివీడు : మతోన్మాద విషాన్ని విరజిమ్ముతున్న ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిలకు వ్యతిరేకంగా పోరాడాలని సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం పిలుపునిచ్చారు. కమ్యూనిస్టు యోధుడు, మహా జ్ఞాని సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి గురువారం స్థానిక సిపిఎం కార్యాలయంలో నిర్వహించారు. సిపిఎం ఏరియా కమిటీ సభ్యులు పింకీ అప్పారావు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. సభ ప్రారంభంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ హిందుత్వ మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడడమే ఏచూరికిచ్చే నిజమైన నివాళు లన్నారు. సనాతన కుటుంబంలో జన్మించి అత్యంత విజ్ఞాన ప్రతిభను కనబరిచిన సీతారాం ఏచూరి నేటి యువకులకు ఆదర్శనీయమని కొనియాడారు. తన చదువులో రాణిస్తూనే దేశంలో ఉన్న పీడిత ప్రజల సంరక్షణకు, వారి హక్కుల సాధనకు మరణించే వరకు నిలబడిన మహా వ్యక్తి అని అన్నారు. దేశంలో మతం పేరుతో విషం కక్కుతున్న కాషాయ మూకలకు తగిన గుణపాఠం చెప్పేలా ఉద్యమించాలని, ప్రజలంతా సంఘటితమవ్వాలని పిలుపునిచ్చారు. ఈ సభలో సిపిఎం ఏరియా కార్యదర్శి కె.తవిటి నాయుడు మాట్లాడారు. ఏరియా కమిటీ సభ్యులు డోకల లక్ష్మి, బివి.వర్మ, డి.రవితేజ, బి.కళ్యాణి, శాకా కిసింజర్, తమ్మిశెట్టి కృష్ణ, నంగెడ్డ కొండ, నూకల సత్తిబాబు, బార్నాల అప్పలనాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంతెన సీతారాం

గోదావరి పుష్కరాలకు రైల్వే ముందస్తు ప్రణాళిక

రైల్వే డిఆర్ఎం నరేంద్ర ఆనంద పాటిల్

నరసాపురం : గోదావరి పుష్కరాలకు రైల్వే ముందస్తు ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు విజయవాడ రైల్వే డిఆర్ఎం నరేంద్ర ఆనంద పాటిల్ చెప్పారు. గురువారం నరసాపురంలో రూ.30 కోట్లతో నిర్మిస్తున్న అమృత్ భారత్ రైల్వేస్టేషన్ నిర్మాణ పనుల్ని పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్న రాజమండ్రి, కొవ్వూరు, నరసాపురం స్టేషన్లలో అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి భక్తుల రద్దీకి అనుగుణంగా రైళ్లు, ఇతర అభివృద్ధి పనులు చేపడతామన్నారు. భక్తుల తాకిడిని తగ్గించేందుకు సమీపంలో ఉన్న స్టేషన్లల్లో కూడా అవసరమైన పనులు చేపడతామన్నారు. దానిలో భాగంగా నిడదవోలు స్టేషన్‌ను గుర్తించామన్నారు. ఇటు నరసాపురం స్టేషన్లో కూడా అవసరమైన పనుల్ని చేపట్టనున్నట్టు డిఆర్ఎం చెప్పారు. డివిజన్లో రూ.720 కోట్లతో కొత్తగా నిర్మిస్తున్న 24 అమృత్ భారత్ రైల్వే స్టేషన్లలో నాలుగు స్టేషన్ల పనులు తుది దశకు చేరుకున్నాయన్నారు. వాటిలో తుని, కాకినాడ, నిడదవోలు, రామవరపుపాడు స్టేషన్ పనులు ఉన్నట్లు చెప్పారు. త్వరలో ప్రధాని మోడీ వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారన్నారు. దసరా, దీపావళి పండుగుల రద్దీకి అనుగుణంగా విజయవాడ డివిజన్ నుంచి ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు తెలిపారు. రైళ్లలో చోరీల నివారణకు ప్రధాన స్టేషన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ముఖ్య రైళ్లలో ఆర్‌పిఎఫ్ పోలీసులు బందోబస్తును పెంచుతామన్నారు. ప్రస్తుతం విశాఖ రూట్లలో ట్రాఫిక్ పెరిగిన నేపథ్యంలో కొత్త రైళ్లను నడపలేమన్నారు. కోటిపల్లి-నరసాపురం రైల్వేలైన్ పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. భూసేకరణ పనులు తుది దశకు చేరాయన్నారు. ఈ కొత్త రైల్వేలైన్ పనులు పూర్తయితే విశాఖ, విజయవాడల మధ్య నడిచే కొన్ని రైళ్లను ఈ మార్గంగుండా మళ్లిస్తామన్నారు. ప్రస్తుతం చెనై-విజయవాడల మధ్య నడుస్తున్న వందేభారత్‌ను త్వరలో నరసాపురం వరకు పొడిగిస్తామన్నారు. దీనికి రైల్వేశాఖ కూడా ఆమోదం తెలిపిందన్నారు. అయితే షెడ్యూల్ సమయాలు ఖరారు కావాల్సి ఉందన్నారు.



పనులు పరిశీలిస్తున్న డిఆర్ఎం

చించినాడ పోరాట నేత గాంధారి మృతి

యలమంచిలి : మండలంలోని చించినాడ గ్రామానికి చెందిన పోరాట యోధురాలు మునకాల గాంధారి(81) వృద్ధాప్యంతో బుధవారం సాయంత్రం మృతిచెందారు. ఆమె భర్త గతంలోనే మృతిచెందగా కుమార్తెతో పాటు మనవళ్లు ఉన్నారు. గాంధారి మృతి చెందారన్న వార్త తెలుసుకొని సిపిఎం సీనియర్ నేత, చించినాడ గ్రామ మాజీ సర్పంచి, మాజీ సొసైటీ అధ్యక్షులు కేతా సూర్యారావు, సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు, మండల కమిటీ సభ్యులు గొల్ల ఏడుకొండల శ్రీనివాస్, తెన్నేటి నాగరాజులు గాంధారి మృతదేహాన్ని సందర్శించి భౌతికాయంపై ఎర్రజెండాను కప్పి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేతా సూర్యారావు, కానేటి బాలరాజు మాట్లాడుతూ.. 1977-80 మధ్యకాలంలో చించినాడలో భూస్వాములు, పేదలకు మధ్య జరిగిన మహా పోరాటంలో కేతా చారుమతి, బుడితి వజ్రమ్మ, శేషమ్మ, సత్యనారాయణమ్మ, తదితర హేమా హేమీ నాయకులతో కలిసి గాంధారి పేదల పక్షాన వీరోచితమైన పోరాటం సాగించారని, పురుషులంతా జైలు జీవితం, అజ్ఞాతవాసంలో ఉండగా శత్రుమూకలను ధైర్యంగా ఎదుర్కొని, ఆనాడు సుమారు నాలుగు కేసులను కూడా ఎదుర్కొని జీవిత చరమాంకం వరకు సిపిఎం పట్ల ఎంతో విశ్వాసంతో మెలిగారన్నారు. ఇటువంటి ధీరవనితులను ఇప్పుడున్న మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. స్థానిక సిపిఎం నాయకులు శెట్టిమి భాస్కరరావు, పల్లేరు వెంకటస్వామి, కోరం వెంకటేశ్వరరావు, గంటా యేసు, జిల్లెల్ల శేఖర్ బాబు, తెన్నేటి స్టాలిన్, పల్లేరు కిరణ్ కుమార్, దుండి తాతాజీ, దుండి విజయ్, విప్పర్తి గణపతి పాల్గొన్నారు.



గాంధారిని సత్కరిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు(ఫైల్ ఫొటో)

2.0 రిజిస్ట్రేషన్ విధానానికి నిరసన

రెండు రోజులు లేఖరుల పెన్ డౌన్

ఆకివీడు : రాష్ట్ర ప్రభుత్వం స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖల దస్తావేజుల రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో ఇటీవల నూతనంగా ప్రవేశపెట్టిన 2.0 విధానం రద్దు చేయాలని కోరుతూ దస్తావేజు లేఖరులు రెండు రోజులు పెన్‌డౌన్ ప్రకటించారు. రాష్ట్రస్థాయిలో ఇచ్చిన పిలుపుమేరకు ఆకివీడు సబ్ రిజిస్ట్రార్ పరిధిలోని లేఖరులు శుక్రవారం, శనివారం పెన్‌డౌన్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఈమేరకు గురువారం సాయంకాలం స్థానిక సబ్ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ విధానం వల్ల సామాన్య ప్రజానీకం ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని వారు వివరించారు. ప్రస్తుత సామాజిక సైబర్ క్రైమ్ దృష్ట్యా ఒటిపి నెంబర్ చెప్పేందుకు పలువురు నిరాకరిస్తుండడంతో ఇది ఒక పెద్ద సమస్యగా మారిందన్నారు. అందుకు తోడు వృద్ధులు సెల్ ఫోన్లు చూడడం చేతకాని వారు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ నూతన పిఇడి విధానం కొంతమేర ఫలితం ఉన్నప్పటికీ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని వారు వాపోయారు. అదేపనిగా ఒటిపి అడుగుతున్నారంటూ ప్రజలు వ్యతిరేకిస్తున్నారన్నారు. ఆటోమొటేషన్ విధానం గందరగోళంగా మారుతుందని తెలిపారు. ఈ వ్యతిరేకత పట్ల విసుగెత్తిన దస్తావేదు లేఖరులు రాష్ట్రస్థాయిలో తీసుకొన్న నిర్ణయం మేరకు ఈనెల 19, 20 తేదీల్లో తాము చేపట్టిన ఈ కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.



సబ్ రిజిస్ట్రార్‌కు వినతి అందజేస్తున్న లేఖర్లు

రైతులు మినుము విత్తనాలు వేసుకోవాలి

జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు

తాడేపల్లిగూడెం : రైతులు సార్వా తర్వాత మినుము విత్తనాలు వేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి జెడ్ వెంకటేశ్వరరావు సూచించారు. గురువారం అప్పారావుపేట, మోదుగుంట, పుల్లయ్యగూడెం పంచాయతీల పరిధిలోని రైతులకు కొత్తరకం మినుము పంట సామూహిక ప్రదర్శన క్షేత్రాలను అప్పారావుపేట రైతు సేవా కేంద్రం వద్ద ఏర్పాటు చేశారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతులకు ఎల్బిజి 884, ఎల్బిజి 904 విత్తనాలను పంపిణీ చేశారు. మార్టేరు వరి పరిశోధన కేంద్రం ఏడీఆర్ డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ రెండు రకాల విత్తనాలు సుమారు 75-85 రోజులు కాలపరిమితి, తెగుళ్లను సక్రమంగా అడ్డుకుంటూ ఎకరానికి 10 క్వింటాళ్లు దిగుబడి వస్తుందని తెలిపారు. అనంతరం జెడి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 250 ఎకరాల్లో ఈ కొత్త వంగడాలను పండించుటకు విత్తనాల పంపిణీ జరిగిందన్నారు. పంట కాలంలో వ్యవసాయ శాఖ, వ్యవసాయ విశ్వవిద్యాలయం సిబ్బంది ప్రతి 15 రోజులకు పంటను పరిశీలించి రైతులకు సూచనలు ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. జిల్లాలో ఒక్క తాడేపల్లిగూడెం మండలంలోనే మినుము సాగు అవుతున్నందున రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తూ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులను సాధించాలని సూచించారు. అప్పారావుపేట గ్రామ సర్పంచి అరుగుల శ్రీనివాస్, మోదుగుంట గ్రామ సర్పంచి జానకిరామయ్య, మండల వ్యవసాయాధికారి వి.నారాయణరావు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

ఎంపిపి మైలాబత్తుల సోని

నరసాపురం : దాతలు అందించే సాయాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి ద్వారా ఆర్థిక అభ్యున్నతి సాధించాలని ఎంపిపి మైలాబత్తుల సోని అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని చిట్టవరం గ్రామానికి చెందిన 28 మంది మహిళలకు భీమవరం రాజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ పేదలు, మహిళల ఆర్థికాభివృద్ధికి ఎంతగానో పనిచేస్తున్న రాజ్ ట్రస్ట్ తమ సేవలను మరింత విస్తృత పరచాలన్నారు. ట్రస్ట్ నిర్వాహకులు గంటా రాజ్ కుమార్, గంటా సందీప్ కుమార్ మాట్లాడుతూ ఇప్పటి వరకు తమ ట్రస్ట్ ఆధ్వర్యాన ఆంధ్ర, ఒడిస్సా, తెలంగాణ రాష్ట్రాలలోని రెండు వేలకుపైగా మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో కలిదిండి ఆనంద్ కుమార్, సర్పంచి తాడి లక్ష్మణరావు, రేవు ప్రభుదాస్, కోపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో 'స్వచ్ఛతాహి సేవా'

ఎంపిడిఒ డాక్టర్ జి.స్వాతి

కాళ్ల : మండలంలోని ప్రతి గ్రామంలో 'స్వచ్ఛతా హి సేవా' కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని గ్రామ కార్యదర్శులకు సూచించామని కాళ్ల ఎంపిడిఒ డాక్టర్ జి.స్వాతి తెలిపారు. కాళ్ల మండల పరిషత్ కార్యాలయంలో గురువారం గ్రామ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ డాక్టర్ జి.స్వాతి మాట్లాడుతూ మండల పరిధిలోని ఆయా గ్రామపంచాయతీల్లో ప్రస్తుత సీజన్లో వ్యాధులు ప్రబలకుండా ఉండేలా పూర్తి స్థాయిలో పారిశుధ్యం మెరుగుపర్చేందుకు చర్యలు చేపట్టాలని గ్రామపంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ప్రతి నెలా మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. స్వస్థనారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం ఈనెల 17 నుంచి అక్టోబర్ రెండో తేదీ వరకు వైద్య శిబిరాలు నిర్వహించాలని, మహిళలు తమ ఆరోగ్యం కాపాడుకునేందుకు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ తగదు

వైసిపి మండల నాయకులు

ఆచంట : ప్రభుత్వ మెడికల్ కాలేజీలను టిడిపి అధినేత చంద్రబాబు ప్రయివేటీకరణ చేయడం సిగ్గుచేటని వైసిపి మండల యువజన విభాగ నాయకులు కోటే శివుడు, కోట గిరిధర్ విమర్శించారు. ఈ సందర్భంగా మండలంలో వైసిపి యువజన విభాగం నాయకులు గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. అనంతరం కోటే శివుడు, కోట గిరిధర్ మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రయివేటీకరణ చేయడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం ఛలో దగ్గులూరుకు జగనన్న నిరసన కార్యక్రమంలో నియోజకవర్గంలోని వైసిపి శ్రేణులు ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి యూత్ నాయకులు జిల్లెళ్ల మహేష్ బాబు, ఉడి రాజేంద్ర, కోగంటి అంబేద్కర్, షేక్ వల్లి పాల్గొన్నారు.

గుండెపోటుతో సీనియర్ అసిస్టెంట్ మృతి

వీరవాసరం : వీరవాసరం మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్గా పనిచేస్తున్న కెవి.రమణారావు(50) బుధవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. రెండు రోజుల క్రితం దైవదర్శనార్థం తిరుమలకు వెళ్లారు. దర్శనం చేసుకుని క్యూలైన్లో ఉండగా గుండెపోటుతో మృతిచెందినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. గురువారం రమణారావు భౌతికకాయాన్ని పాలకొల్లు ఆయన స్వగ్రామం తీసుకొచ్చారు. ఆయన మృతదేహానికి పలువురు నివాళులు అర్పించారు. ఎంపిడిఒ అప్పారావు, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు సంతాపం తెలిపారు.

విశాఖపట్నం వరకూ రైలు ఏర్పాటు చేయాలని వినతి

నరసాపురం : నరసాపురం విచ్చేసిన డివిజనల్ రైల్వే మేనేజర్ డిఆర్ఎం ఆనంద్ పాటిల్కు జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు వనమాల శ్రీనివాస్ కలిశారు. నరసాపురం నుండి విశాఖపట్నం వెళ్లుటకు గతంలో ఉన్న సింహాద్రి ఎక్స్ప్రెస్ పునరుద్ధరించవలసిందిగా కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వనమాల శ్రీనివాస్ మాట్లాడుతూ నరసాపురం నుండి విశాఖపట్నం వెళ్ళుటకు కొరోనాకు ముందు వరకు సింహాద్రి ఎక్స్ప్రెస్ ట్రైయిన్ ప్రతిరోజూ సాయంత్రం ఉండేదన్నారు. ఇక్కడ నరసాపురంలో ఉత్తరాంధ్ర నుండి ఉపాధి నిమిత్తం వచ్చిన వెనుకబడిన కులాలకు చెందిన వారు అధిక సంఖ్యలో ఉన్నారని, వాళ్ళు ఊరు వెళ్ళుటకు ఆ ట్రైయిన్ అనుకూలంగా ఉండేదన్నారు. వెంటనే సింహాద్రి ఎక్స్ప్రెస్ ట్రైయిన్ పునరుద్ధరించాలని డిఆర్ఎంను కోరారు.

స్థూలకాయంపై అవగాహన



యలమంచిలిలో...

యలమంచిలి : స్థూలకాయంపై పలు జాగ్రత్తలు పాటించాలని పాలకొల్లు సెక్టార్ సిడిపిఒ సిహెచ్.ఉమ అన్నారు. గురువారం మండలంలోని కలగంపూడి, కాంబొట్లపాలెం గ్రామాల్లో 8వ రాష్ట్రీయ పోషణమాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ స్థూలకాయం నివారణకు చక్కెర, నూనెల వినియోగం తగ్గించాలని, పోషకాహారాన్ని అందించే విధంగా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్, ఆరోగ్య సిబ్బంది, గర్భవతులు, పిల్లల తల్లిదండ్రులు, సూపర్వైజర్ ఎంఎస్.పద్మావతి, డాక్టర్ సరిత, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెనుమంట్ర : అధిక చక్కెర, నూనె, జంక్ ఫుడ్ వినియోగం వల్ల ఊబకాయం వచ్చే ప్రమాదం ఉందని పెనుమంట్ర ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి అంగర కృష్ణకుమారి అన్నారు. గురువారం పోషకాహార మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా పెనుమంట్ర 2, ఆలమూరు 3 అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల్లో ఊబకాయం, చక్కెర, నూనె వినియోగం గురించి అవగాహన కల్పించారు. ఆలమూరు 3 అంగన్వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సూపర్వైజర్ ఎస్.వెంకటలక్ష్మి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

కాళ్ల : రోజువారీ ఆహారంలో నూనె, చక్కెర వాడకం తగ్గించుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కాళ్ల పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ సునీత సూచించారు. కాళ్లకూరు గ్రామంలో 'సుపోషిత్ భారత్, సక్షం భారత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచి సాధు శ్రీదేవి పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగిన విద్యుత్ ఉద్యోగుల ఆందోళన

భీమవరం టౌన్ : తమ న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు దశలవారీగా పోరాటాలు చేస్తామని విద్యుత్ ఉద్యోగుల జెఎసి హెచ్చరించింది. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా భీమవరం విద్యుత్ సర్కిల్ కార్యాలయం వద్ద విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు చేపట్టిన ఆందోళన గురువారం రెండో రోజు కొనసాగింది. రాష్ట్ర విద్యుత్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపులో భాగంగా గురువారం భీమవరంలోని జిల్లా సర్కిల్ కార్యాలయం ఎదుట విద్యుత్ ఉద్యోగులు భోజన విరామ సమయంలో ఆందోళనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు శ్రీకాంత్, వి.చలపతిరావు, ఎం.శ్రీనివాసరాజు, ఆరేటి నాగమురళీకృష్ణ, సుబ్రమణ్యం, బాలకృష్ణ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై అవగాహన

తాడేపల్లిగూడెం : విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వ్యసనాలకు లోను కాకుండా సమాజ నిర్మాణంలో ఉన్నత పాత్ర పోషించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ ఇ.స్వరాజ్యలక్ష్మి తెలిపారు. దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ, డ్రీమ్ డి అడిక్షన్ సెంటర్ ఆధ్వర్యాన నషాముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు వ్యసనాలకు లోనుకాకుండా ఉన్నతస్థాయికి చేరుకోవాలని తెలిపారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

మట్టి ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందజేత

కాళ్ల : కాళ్లకూరు గ్రామం కొత్త కాలనీకి చెందిన సీలు శాంతమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. ఈవిషయం తెలుసుకున్న డాక్టర్ దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత దాట్ల వెంకటరామరాజు ముందుకొచ్చి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని ట్రస్ట్ ద్వారా శాంతమ్మ కుమార్తె బోండా లలితకు గురువారం అందజేశారు. పెన్మెత్స నాగరాజు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని ఉపయోగించుకోవాలి

ఎస్ఎస్ఎండిఎ కృష్ణారావు

గణపవరం : సన్నబియ్యం, పోషకాలు కలిగిన మధ్యాహ్న భోజన పథకాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలని ఎస్ఎస్ఎండిఎ సమన్వయ కర్త కృష్ణారావు అన్నారు. గురువారం పిప్పర జిల్లా పరిషత్ హైస్కూల్లో మధ్యాహ్నం భోజనాలను, టాయిలెట్స్ను, మంచినీటి వసతులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు స్కూల్లో పెడుతున్న భోజనాన్ని ఉపయోగించుకొనే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని అన్నారు. పథకానికి సంబంధించిన రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. పాఠశాలలో 453 మంది విద్యార్థులకు 420 మంది కృష్ణారావుతో కలిసి భోజనం చేసారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం పిజె.వెంకటేశ్వర్లు, ఎఎంసి ఛైర్మన్ బాలాజీ, సిఆర్పి.జోగయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

22న ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ జట్ల ఎంపిక

వీరవాసరం : జిల్లా విద్యాశాఖ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన ఈనెల 22వ తేదీన ఫెన్సింగ్, బాక్సింగ్, టేబుల్ టెన్నిస్, మాల్కంబ్, టెన్నిస్(లాన్ టెన్నిస్) క్రీడాంశాలలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాలబాలికల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు పశ్చిమగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు డి.సునీత, పిఎస్ఎన్.మల్లేశ్వరరావు గురువారం తెలిపారు. నిర్దేశించిన వివిధ హైస్కూల్స్లో ఈ ఎంపికలు జరుగుతాయని తెలిపారు. ఫెన్సింగ్ అండర్ 14, 17 బాలురు, బాలికలు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల శృంగవృక్షం బాక్సింగ్ అండర్ 14, 17(బాలురు బాలికలు) జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల వీరవాసరం, టేబుల్ టెన్నిస్ అండర్ 14, 17 బాలురు, బాలికలు శ్రీ చింతలపాటి బాపిరాజు మున్సిపల్ హైస్కూల్ భీమవరం, మాల్కంబ్ అండర్ 14, 17 బాలురు, బాలికలు శ్రీచింతలపాటి బాపిరాజు మున్సిపల్ హైస్కూల్ భీమవరం, టెన్నిస్(లాన్ టెన్నిస్ అండర్ 14, 17 బాలురు, బాలికలు టౌన్ హాల్ పాలకొల్లులో జరుగుతాయన్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు 22వ తేదీ ఉదయం 10 గంటలకు తప్పనిసరిగా ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికేట్తో హాజరు కావాలని తెలిపారు.

108 అంబులెన్స్ ప్రారంభం

తాడేపల్లిగూడెం : రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వం పేదలకు ఉచిత వైద్య సేవలను అందించే 108 అంబులెన్స్లను గురువారం ఉదయం ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో ప్రారంభించడం శుభ పరిణామమని రాష్ట్ర విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోడీ పుట్టినరోజు వారోత్సవాల్లో భాగంగా తల్లీబిడ్డ పరిపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్న కృతనిచ్చయంతో సిఎం నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రిలో పేదవారికి ఉచిత సేవలను అందిస్తున్నారని స్పష్టం చేశారు. అందులో భాగంగా గురువారం తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో 108 అంబులెన్స్ ప్రారంభించి ప్రజలకు అంకితం చేసామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వర్తనపల్లి కాశి, పుల్లా బాబి, అడప ప్రసాద్, నీలపాల దినేష్ యాదవ్ పాల్గొన్నారు.

బాలికలకు సైకిళ్లు పంపిణీ

పాలకోడేరు : వేండ్ర జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న సాదేసుహాని, దయామణికి మోగల్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్ మేనేజర్ ఎస్ఎన్డి.ప్రసాద్ చేతుల మీదగా సిఎస్ఆర్ పథకంలో సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు చదువుపై ఎక్కువ దృష్టి పెట్టి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. జీవితంలో అభివృద్ధి సాధించి కుటుంబానికి బాసటగా నిలవాలని పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జివివి.శ్రీనివాస్ మాట్లాడుతూ బ్యాంకు ద్వారా తమ విద్యార్థులకు సహకారం అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎం. వెంకటరమణ, జె.శ్రీనివాస్, ఎం.విశ్వనాథరాజు, పంపన సాయిబాబు, శు భోసుబాబు పాల్గొన్నారు.

రహదారి మధ్యలో ఆగిన ఆర్టిసి బస్సు

ప్రయాణికుల ఇబ్బంది

పెనుగొండ : ఈ మధ్యకాలంలో గమ్యం చేరకుండానే మార్గ మధ్యలో రిపేర్లు రావడంతో ప్రయాణికులు ఇబ్బందికి గురవుతున్నారు. పెనుగొండ నుండి భీమవరం వెళుతున్న ఆర్టిసి బస్సు మధ్యలో ఆగిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. కాలేజీ విడిచిపెట్టే సమయం కావడంతో విద్యార్థులు, వివిధ పనుల మీద వెళ్లేవారు సమయానికి చేరలేక అవస్థలు పడ్డారు. ఈ మధ్యకాలంలో మహిళా శక్తి పథకం ఉచిత బస్సు ప్రయాణం వచ్చిన తర్వాత బస్సుల్లో మహిళలు ఎక్కువమంది ప్రయాణిస్తున్నారని, దీనికి తగిన విధంగా బస్సులు నడపాలని కోరుతున్నారు.

ఆటో కార్మికుల ఔదార్యం

బస్ క్లీనర్కు ఆర్థిక సాయం అందజేత

పాలకోడేరు : కుమదవల్లి శ్రీచైతన్య స్కూల్ బస్సు క్లీనర్గా పనిచేస్తున్న యండగండి గ్రామానికి చెందిన అప్పలనాయుడు భార్యకు రొమ్ము కేన్సర్ రావడంతో తీవ్ర అనారోగ్యంతో చాలా కాలంగా మంచానికి పరిమితమయ్యారు. తమ ఆర్థిక పరిస్థితి బాగోలేకపోవడంతో అప్పలనాయుడుకు వచ్చే కొద్దిపాటి జీతంతోనే వయస్సు పైబడిన ఆ వృద్ధ దంపతులు ఇంటి ఖర్చులతో పాటు హాస్పిటల్కి వెళ్లి అరకొరా మందులు తెచ్చుకుని ఇంటి దగ్గరే బతుకీడుస్తున్నారు. విషయం తెలుసుకున్న స్కూల్ ఆటో కార్మిక సోదరులు మానవతా దృక్పథంతో సాటి మనిషికి సహాయాన్ని అందించాలనే సంకల్పంతో ముందుకు వచ్చి ఆమె మందుల ఖర్చులు నిమిత్తం రూ.12 వేల ఆర్థిక సహాయాన్ని స్కూల్ ప్రిన్సిపల్ కృష్ణంరాజు చేతుల మీదుగా అప్పలనాయుడుకు అందజేశారు.

పి-4లో భాగస్వాములు కండి : సిపిఒ

భీమవరం : పేదరికం లేని సమ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని సిపిఒ కంటిపూడి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక కలెక్టరేట్లో గురువారం పి- 4 కార్యక్రమం అమలులో భాగంగా జిల్లా ప్రణాళికా శాఖ గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. పేదరికంలేని సమాజ నిర్మాణానికి రాష్ట్ర ముఖ్యమంత్రి అత్యంత ప్రతిష్టాత్మకంగా పి-4 కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారన్నారు. ప్రభుత్వ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలన్నారు. ఈనెల 20 నుండి 30వ తేదీ లోపు మార్గదర్శిల ద్వారా బంగారు కుటుంబాలకు పొందుతున్న సహాయాన్ని సిబ్బంది పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో విజయవాడ ప్లానింగ్ శాఖ తరపున అసిస్టెంట్ డైరెక్టర్ రోహిణి కుమారి పాల్గొన్నారు.

విచారణ పారదర్శకంగా పూర్తి చేయండి

ఉప సర్పంచి బొర్రా సువర్ణ రాజు

ఉండి: గత సామాజిక తనిఖీలో ఆడిట్ అధికారులు గుర్తించిన రూ.13.64 లక్షల అవకతవకలకు సంబంధించిన విచారణను పూర్తిస్థాయిలో పారదర్శకంగా నిజనిర్ధారణ చేయాల్సిన బాధ్యత అంబుడ్స్మాన్ కమిటీపై ఉందని చినపుల్లేరు గ్రామ ఉప సర్పంచి బొర్రా సువర్ణ రాజు అన్నారు. గురువారం మండలంలోని చినపుల్లేరు గ్రామంలో అంబుడ్స్మాన్ కమిటీ అధికారులు పర్యటించారు. విచారణలో ఎపిఒ లంకపల్లి ఒమేగా రాజు, సభ్యులు పాల్గొన్నారు.

పొన్నాడ రాము, వంకాల రాము ఆదర్శనీయులు

ప్రథమ వర్ధంతిలో నేతలు



నరసాపురం: నివాళులర్పిస్తున్న నాయకులు

నరసాపురం : కార్మికవర్గ నాయకుడు పొన్నాడ రాము, వంకాల రాముల ప్రథమ వర్ధంతి సభను మీరా గ్రంథాలయంలో సిఐటియు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వారిరువురి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తూ జోహార్లు తెలియజేశారు. అనంతరం జరిగిన సభను ఉద్దేశిస్తూ సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కవురు పెద్దిరాజు మాట్లాడారు. పొన్నాడ రాము 12 ఏళ్ల వయసు నుండి కుటుంబ ఆర్థిక పరిస్థితుల వల్ల అటుకుల మిల్లులో అర్ధ రూపాయి రోజువారి కూలీ పని చేస్తూ జీవితం ప్రారంభించారన్నారు. యువకుడిగా ఉండగా డివైఎఫ్ఐ యువజన సంఘం కార్యక్రమాలకు ఆకర్షితులై డివైఎఫ్ఐ కార్యక్రమాల్లో చురుకైన కార్యకర్తగా పనిచేస్తూ పట్టణ అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహించారన్నారు. అనంతరం కార్మికవర్గ నాయకుడిగా సిఐటియు సంఘంలో పనిచేస్తూ బజార్ జట్లు, రైస్మిల్ హమాలీ కార్మికుల సమస్యల పరిష్కారానికి పనిచేశారన్నారు. ఉద్యమాల్లో చురుకైన పాత్రను రాము నిర్వహించారని కొని యాడారు. అనంతరం సిఐటియు మాజీ నాయకులు పొగాకు నారాయణరావు, మంచిలి నీలకంఠం, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు పున్నాన్ని అప్పలనాయుడు, పొన్నాడ మల్లేష్ బోడ సింగ్ అప్పారావు, పైల అప్పలనాయుడు, పైలా ప్రసాద్, నాగేశ్వరరావు, జగన్ పాల్గొన్నారు.

పలుచోట్ల 'స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్'

నరసాపురం: నరసాపురం పట్టణం మున్సిపు స్ట్రీట్ అర్బన్ పిహెచ్సిలో గురువారం స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య పాల్గొని మాట్లాడారు. మహిళల ఆరోగ్యంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాయన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్యులు కారిచర్ల మోహనా, వి.రంజిత్, జి.విజ్ఞాని వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

గణపవరం : జల్లికొమ్మరలో గురువారం స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. గణపవరం పిహెచ్సి డాక్టర్లు పి.కిరణ్మయి, కె.ఓంకార్ నాద్ మహిళలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించి వైద్యపరీక్షలు నిర్వహించారు. 212 మందికి వైద్యపరీక్షలు చేసినట్లు చెప్పారు. గ్రామ సర్పంచి కురేళ్ల వెంకటరత్నం, కవల రాంబాబు, ఎం.మహింకాళీ పాల్గొన్నారు.

ఉండి : మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం అభివృద్ధి చెందుతుందని టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు అన్నారు. బుధవారం ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని కలిసిపూడి గ్రామ సర్పంచి కేశబోయిన జానకిశ్రీనివాస్, మండల సమాఖ్య అధ్యక్షురాలు కర్రి జయలక్ష్మి శ్రీనివాస్ ప్రారంభించారు. కార్య క్రమంలో ఎంపిటిసి కునుకు రమాదేవి శ్రీనివాస్, డిసి వైస్ ఛైర్మన్ మంతెన సాయి లచ్చిరాజు, ముదునూరి కృష్ణంరాజు, పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ పి.సునంద పాల్గొన్నారు.

పాలకోడేరు : స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్లో భాగంగా మహిళల ఆరోగ్యపరిరక్షణకు నిర్వహిస్తున్న ప్రత్యేక ఆరోగ్య శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని పెన్నాడ సర్పంచి చిల్లా అమాష సత్యనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక సచివాలయం వద్ద ఉచిత వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ గులాబ్ రాజకుమార్ మాట్లాడారు. శిబిరంలో డాక్టర్ లీలా లక్ష్మి, డాక్టర్ హిషిత, మజాత, మాజీ సర్పంచి రామకృష్ణ పాల్గొన్నారు.

రేపు పెద్ద తాడేపల్లిలో మెగా వైద్య శిబిరం

సర్పంచి పోతుల అన్నవరం

తాడేపల్లిగూడెం : మండలంలోని పెద్ద తాడేపల్లిలో ఈనెల 20వ తేదీన మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సర్పంచి పోతుల అన్నవరం తెలిపారు. తాడేపల్లిగూడెం చైతన్య ఎమర్జెన్సీ హాస్పిటల్, విజయవాడ కామినేని హాస్పిటల్ వైద్యులతో వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వైద్యశిబిరంలో గుండె సంబంధిత వ్యాధులు, ఆయాసం, ఊపిరితిత్తులలో నీరుచేరుట, కోవిడ్ తరువాత వచ్చే ఇబ్బందులు, అన్ని రకాల శ్వాసకోస వ్యాధులు షుగర్, బిపి, పక్షవాతం, మూర్ఛ, తలనొప్పి అన్ని రకాల నరాల సంబంధిత వ్యాధులు, అన్ని జనరల్ వ్యాధులు, ఎముకలకు సంబంధించిన వ్యాధులు, బిపి, షుగర్, ఇసిజి పరీక్షలు చేసి అవసరమైన వారికి ఎక్కువ గుండె స్కానింగ్ పరీక్ష కూడా ఉచితంగా చేయబడునని తెలిపారు. భారీగా ప్రజలు తరలివచ్చి సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రైల్వే గేటు మూత..ట్రాఫిక్ మళ్లింపు

ముందస్తు సమాచారం లేకపోవడంతో వాహనదారుల అసహనం

ఉండి : ఎటువంటి ముందస్తు సమాచారం ప్రచారం లేకుండా ఉండి మెయిన్ సెంటర్ నుండి ట్రాఫిక్ మళ్లించడంపై వాహనదారులు ఒకింత అసహనానికి గురయ్యారు. ఉండి రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణ పనుల్లో భాగంగా ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ట్రాఫిక్ మళ్లించాలని బ్యానర్లు ఏర్పాటు చేసి మెయిన్ సెంటర్లో రోడ్డుకు అడ్డుగా బారికేడ్ ఏర్పాటు చేయడంతో వాహనదారులు అసహనానికి గురయ్యారు. ఈ సందర్భంగా పలువురు భారీ వాహనచోదకులు, పలు విద్యాసంస్థలకు చెందినవారు మాట్లాడుతూ ముందస్తుగా సమాచారం ఇస్తే తాము సన్నద్ధమయ్యే వాళ్లమని కానీ, సమాచారం ఇవ్వకుండా మూసివేయడం సరికాదని అన్నారు.

ఆకివీడు : ఏవిధమైన సమాచారం లేకుండా జాతీయ రహదారి 216పైన ఉండి గ్రామం వద్ద ఉన్న రైల్వే గేటును ఆకస్మికంగా మూసివేయడంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులకు గురయ్యారు. ఆకివీడు నుండి భీమవరంకు ప్రతినిత్యం వేలాది మంది ప్రయాణిస్తూ ఉంటారు. అయితే ఇటీవల గత కొంతకాలంగా భీమవరం గేట్ మరమ్మతుల నిమిత్తం మూసివేశారు. అందుకు సమాచారం ఇవ్వడంతో ప్రయాణికులు భీమవరం పొలిమేరల నుండి దారి మార్చుకుని ప్రయాణించారు. అయితే ఉండి నుండి మాత్రం ఆ అవకాశం లేకపోవడంతో ఆకివీడు నుండి దాకా వెళ్లినవారు తిరిగి ఆకివీడుకు తొమ్మిది కిలోమీటర్లు వెనక్కి రావలసి వచ్చింది దీంతో అసహనానికి గురయ్యారు.

అసంపూర్తిగా తణుకులో ఫ్లైయ్ ఓవర్ నిర్మాణం

అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో ఇబ్బందులు

అసెంబ్లీ సమావేశాల్లో ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ

తణుకు : తణుకు మీదుగా వెళ్లే 216 జాతీయ రహదారిపై ఉండ్రాజవరం జంక్షన్ వద్ద నిర్మాణంలో ఉన్న ఫ్లై ఓవర్ బ్రిడ్జి పూర్తి కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో ఎంఎల్ఎ రాధాకృష్ణ మాట్లాడారు. నాలుగు సంవత్సరాల క్రితం ప్రారంభించిన ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కనీసం 60 శాతం కూడా పూర్తి కాకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని శాసనసభ దృష్టికి తీసుకువచ్చారు. కేవలం కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే పనులు ముందుకు సాగడం లేదన్నారు. సర్వీస్ రోడ్లు ఇరువైపులా పూర్తిస్థాయిలో శిథిలావస్థకు చేరడంతో వర్షాకాలంలో వాహనదారులు నిత్యం అవస్థలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇటీవల వర్షాకాలంలో ఇద్దరు మృతి చెందిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కాంట్రాక్టర్తో పాటు జాతీయ రహదారి అభివృద్ధి అధికారులతో మాట్లాడినప్పటికీ ఏడాదిన్నర కాలంగా వారి నుంచి ఎలాంటి స్పందన రావడంలేదని అన్నారు. పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

మద్యం బార్లకు లాటరీ

భీమవరం : భీమవరం కలెక్టరేట్లో ఐదు మద్యం బార్లకు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి లాటరీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో జనరల్ కేటగిరిలో 28 బార్లకు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయగా 15 బార్లకు సంబంధించిన లాటరీ ప్రక్రియను ఆగస్టు 30న పూర్తి చేసి బార్లను కేటాయించడం జరిగిందని తెలిపారు. మిగిలిన 13 బార్లకు రెండవ విడత గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయగా ఐదు బార్లకు సంబంధించి మాత్రమే దరఖాస్తులు అందాయన్నారు. వాటిలో భీమవరం పరిధిలో నాలుగు, నరసాపురం పరిధిలో ఒకటి మొత్తం ఐదు బార్లకు ఒక్కొక్క బారుకు నాలుగు దరఖాస్తుల చొప్పున ఒకే అభ్యర్థి దరఖాస్తు చేసుకోవడంతో వారినే ఏకగ్రీవంగా ఎంపిక చేసి బార్లను కేటాయించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఇన్ఛార్జి అధికారి ప్రభు కుమార్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రసాద్ రెడ్డి, అజయ్ కుమార్, సర్కిల్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు రాత పుస్తకాల పంపిణీ

పాలకొల్లు : వీరవాసరం మండలంలోని రాయకుదురు జెడ్పి హైస్కూల్ ప్లస్లో మొదటి సంవత్సరం ఇంటర్ చదువుతున్న 28 మంది బాలికలకు రూ.7 వేల విలువైన రాత పుస్తకాలను వాకర్స్ క్లబ్ పాలకొల్లు తరపున అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు క్లబ్ సభ్యులతో కలిసి పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కానుకొలను శ్రీనివాస్ గత 3 సంవత్సరాలుగా వాకర్స్ క్లబ్ పాలకొల్లు తరపున ఇంటర్ బాలికలకు అందిస్తున్న ప్రోత్సాహకాలకుగాను క్లబ్ అధ్యక్షుడు, సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.